# ఫస్ట్ ప్రైజ్



ఫెయిర్ సెక్స్ క్లబ్ వారు, ఒక ప్రకటన ''మహిషి'' అనే మాసపత్రికలో వేయించారు. పత్రికకు మంచి పేరూ వ్యాప్తీ వున్నాయి. దాని అజమాయిషీ అంతా మహిళల చేతుల మీదుగా నడుస్తున్నది. పటుత్వమైన, కుతూహలం కలిగించే, మహిళల్లో చైతన్యం రేపే రచనలే ఆ మాసపత్రికలో పడతాయి. పురుషపుంగవులు మారుపేరుతో వ్రాసి పంపినా, సంపాదకురాలూ, కమిటీ స్త్రీలూ, సంపాదక వర్గీయులైన మహిళలు పసిగట్టి, నిగ్గుదేల్చి, పురుషుల గొప్పతనమే వెల్లడైందని నిరసించి, ''మీ రచన వేయజాలమని తెలియజేయుటకు చింతించుచున్నాము. దయచేసి ''సింహాలు'' అనే క్లబ్‌వారు నడిపే ''పులి'' అనే మాసపత్రికకు పంపమని మా సలహా. రమణ అనే పేరును రమణి అని మార్చినా కథలోని సారాంశం రమణుని గొప్పతనమేనని తేల్తుంది. అలా వ్రాయటం సహజం. ధన్యవాదాలు సంపాదక వర్గం'' అని చీటీ జోడించి తిప్పేస్తారు. చిరునామా లేకపోయినా, స్టాంపులు జోడించకపోయినా ఆ రచన చెత్తబుట్ట దాఖల్.

ప్రకటన వివరాలూ మరియు నిబంధనలు.

''పోటీలో పాల్గొనండి. నదరైన రొక్కం గెలవండి. పోటీలో ఫెయిర్ సెక్సే పాల్గొనవలెను.

వీడియోఫిల్మ్ తీయించి తెచ్చుకొనవలెను. త్రివర్ణ చిత్రమే స్క్రీన్ చేయబడును. కాలము పదినిమిషాలే. వ్యాయామ చిత్రంలాగా నీట్‌గా వుండి లైటింగ్ బావుండవలెను. అంశము సారాంశము. ఒకరి నెత్తిన ఒకరి నెక్కించటంలో, వారి చేత డబ్బు కక్కించటంలో సమర్థత వున్న మహిళ కార్క్టర్ చిత్రింపబడవలెను. కథాగమనంలో ఫెయిర్ సెక్సే గొప్పది అని వెల్లడి కావాలి. కథలో పురుష పాత్రలు ఒకటినుండి, మూడుకి మించరాదు. ఆ పాత్రల స్వార్థము, మూర్ఖత్వము తెలివితక్కువ నిరూపణ కావలెను. లీడింగ్ లేడీ నేర్పుగా గుట్టుగా తన పైసా కాపాడుకుంటూ ఖర్చులు యితరుల నెత్తిన రుద్దే నేర్పరి

కావాలి. ముఖ్యపాత్ర విడో అయినా, డైవోర్సీ అయినా, ఆమె డైవోర్సు పెండింగ్‌లో వున్నా, యెఫైర్సున్నా, బోయ్‌ఫ్రెండున్నా కథ కడ్డురాకుండా వుంటే కథ పక్కపుంతలు తొక్కకుండా వుంటే యెన్నికకు అర్హత వుండును. స్లో పాయిజనిచ్చి దివికి పంపగల, హత్యచేసి స్కాట్‌ఫ్రీగా పోగలిగిన కారెక్టర్లు చిత్రించవచ్చు. యేమీ అట్టివారు మేల్సులో వున్నారు గదా! న్యాయం గమనించాలి. మేల్ ఓరియెంటెడ్ ఫిల్ము, కోకొల్లలుగా విడుదల కావటం లేదూ! గ్లేమరు కోసం, డాల్సుగా స్త్రీ పాత్ర చిత్రణ జరగటం లేదూ? వారి ముఖ్యోద్దేశం డబ్బు రాల్చటమే. ఫెయిర్‌సెక్సులోనూ అలాటి ప్రతిభగల వారున్నారని నిరూపించటమే, మహిళాలోకాన్ని మేల్కొల్పటమే, వారిలో చైతన్యము కలిగించటమే యీ పోటీ ఆశయం. పాతకాలంలో స్టంట్ చిత్రాలు, క్రైమ్ చిత్రాలలో ముఖ్య పాత్రలు మహిళలే. హంటర్ వాలీ, యెర్ర జెండా, ఇస్పేటాసు వంటి చిత్రాలు తీసి రంజింప చేశారు. అప్పుడు లేని బాధ యిపుడూ కలగరాదు''. ఫెయిర్ సెక్స్ క్లబ్ సెలెక్టు కమిటీ.

## 2

ప్రైజు ఆకర్షించింది. పోటీదారులకు సౌకర్యాలు చిరుతిండి, పానీయాలు, తగినంత వ్యవధి, కావాలంటే అప్పు లభించగా వుత్సాహించి చాలా మంది మహిళలు పోటీలో పాల్గొన్నారు. స్పెషల్ బస్సులు నడిచాయి. వింత యేమిటో తెలుసుకోవాలనీ యిన్ని ఖర్చులు భరించే ఆ సంస్థ యెంత భాగ్యశాలియో అనీ పాల్గొన్నారు మహిళలు. క్లబ్ హాలు సభికులతో ప్రేక్షకులతో కిటకిటలాడింది. వన్నెవన్నెల చీరలు, అలంకారాలు, బులాకీ, నత్తు, ముక్కర, బొగడలు అలంకరించుకున్న వారి దగ్గర్నుంచి, మోడరన్ అమెరికన్‌లాగా దుస్తులూ, హెయిర్ డు చేసుకున్నవారు, ఆఫ్రికన్ హెయిర్‌డు చేసుకున్నవారు, అవే పోలికలు గల వారూ వచ్చారు. పోటీలో పాల్గొనే వీడియో ఫిల్మ్ షో చూడటానికి కొంతమంది ప్రేక్షక ద్వారం వద్ద షోగ్గా నిలబడీ, పచార్లు చేస్తూ చూస్తున్నారు. మోడెల్ షోలో లాగా వున్న వారిని తక్కినవారు చూస్తున్నారు.

దూరదర్శన్‌మీద వీడియోఫిల్మ్స్ రన్నవుతున్నాయి. ప్రేక్షకులు నవ్వుతున్నారు. యేడుస్తున్నారు, హవ్వ! అంటున్నారు. అయ్యో! అంటున్నారు. దవడల మీద చేయి వేసుకుంటున్నారు. చిరుతిండి తింటున్నారు. సాఫ్ట్ డ్రింక్సు పుల్లతో పీలుస్తున్నారు. టీ సేవిస్తున్నారు. పిల్లల్ని ముద్దు చేసుకుంటున్నారు. సముదాయిస్తున్నారు. సెంటు వాసనలు, పూలవాసనలు, పంకాలు తిరుగుతున్నాయి. క్లబ్ చుట్టూ వున్న పూల మొక్కల పూల వాసనలూ లోపలికి వస్తున్నాయి. దీపాలు తోరణాలు పిల్లల్ని అలరిస్తున్నాయి. ఆరనూ వెలగను వింత గొల్పుతున్నది. సంపెంగ, విరజాజి, దిల్‌బహార్, పొగడ, పారిజాతం, చంద్రకాంతలు, రేరాణి, గులాబీలు, పున్నాగ పూలవాసనలు.

ఫిల్మ్ మొదలౌతూనే నడివయస్కురాలు, భర్తృహీన కొంపలంటుకుంటున్నట్టు సుడిగాలిలాగా పెద్దకూతురింటికి రైలు స్టేషన్నించి వచ్చింది. గుడుగుడుమని గూడుపుఠాణీ చేసింది. ప్లేటు ఫిరాయించి పెద్దల్లున్ని కలుసుకుని పాదాలు తాకి ''మహాకష్టదశ'' అంటూ నిలబడి ముసుగు లాక్కుని ముక్కు పీకున్నది.

''అందితే జుట్టు, అందకపోతే కాళ్లు'' యీ అత్తదేనికొచ్చిందో?, ఊరకరారు మహాత్ములు. యెవరిని నా నెత్తికెక్కించాలని పథకం వేసిందో? పైసా ఖర్చు చేయించాలనేమో'' అని గొణుక్కుంటుండగా అత్త ''నీ తోడల్లుడంతా అమ్మి వ్యాపారమని పట్నమొచ్చి మంచమెక్కాడు. నీ మరదలికేమైనా మిగిల్చాడో లేదో గురూ! (పెద్దల్లుని పేరు గుర్నాథం) మదనపల్లి శానిటోరియంలో చేర్పించమని యేడుస్తున్నాడు'' అంటున్నది. ఇక్కడికి మదనపల్లి దగ్గరగాదే?'' అన్నాడు మెల్లిగా. ''దగ్గరా దూరమా అనిగాదు'' అని లాయరులాగా చూసింది అత్త. ''నీ మరదలికి యేపాటి మిగిల్చాడో తెలుసుకోవటానికి నీ సాయం గావాలి. కోర్టుకెక్కటానికి డబ్బేదీ?'' అన్నది.

మానవుడైన గుర్నాథం చేయగలిగిన సాయం చేస్తూ అందించగలిగినవి అందిస్తున్నాడు నెత్తినెక్కినవారికి. ''నా భార్యాబిడ్డను గని నెలన్నా తిరగలేదు.

అంతిమదశలో వున్న అంటువ్యాధి మనిషిని తెచ్చి నా నెత్తిన రుద్దటానికి మనసెట్లా ఒప్పిందో యీ అత్తకి'' అని కళ్లుతుడుచుకున్నాడు పైబట్టతో.

తోడల్లుడే వివేకం గలవాడా అన్నట్టు వచ్చిన నాలుగోనాడే పరమపదసోపానాలెక్కాడు. స్త్రీ జనం గొల్లుమన్నది. రాత్రి ఒంటిగంట. మర్నాడు పొద్దునే ఫోన్‌కాల్ అందినట్లు పెద్ద బావమరిది, కర్మిష్ఠి కర్మలు చేయటానికి ఆకాశం నించి వూడిపడ్డాడు. తానూ శోకం పర్‌ఫెక్టుగా అభినయం పట్టాడు. యెదురింట్లో వున్న పురోహితుడు వచ్చి, ''మీ తోడల్లుడు పోయిన నక్షత్రం మంచిదిగాదు బాబూ పోయిన ప్రాణికది మేలే చేస్తుందిగానీ, వున్నవారి కది చేటే చేస్తుంది. ఈ యింట్లో నించి మూడు ప్రేతాత్మలు ప్రేతభూమికెళ్తాయి. ఇల్లు పాడుబెట్టాలి'' అన్నాడు.

''అది మూఢ నమ్మకం. ఇల్లు అద్దె యిల్లు. నేనెట్లా పాడుబెడతానూ? ఇంటివారే చేయాలా పని. ప్రాణా వశిష్ఠుని వాని భార్యను కొడుకును గూడా తెచ్చి నా నెత్తిన రుద్దటమే గాక వైద్యుని తెమ్మని పురమాయిస్తే తెచ్చాను. వాడా అత్తకంటి కానలేదు. పంపేయి. ఘనవైద్యుని తేవాలి. హాస్పిటల్ సూపరింటెండెంట్‌ని తేవాలి'' అని హుకుమ్. వూరికే వస్తారా అంటే తలతాటించి, మూతి విరిచి డబ్బుకి వెనుకాడుతున్నాడని హేల. భార్యతో మొత్తుకున్నా. అప్పుల పాల్లై ఆస్తిగుండానపడి రెక్కలు రాని పక్షులంటూ నీ ముద్దుల తమ్ముడినీ చెల్లినీ నీ మాద వదిలేస్తే, ముప్పొద్దులా మేపుతున్నాను చాలదా అంటే, ధర్మపత్ని యేడుస్తూ యేమి చెప్పిందో చెప్పేదా '' ఆర్నెల్లు చూలింత వేషం. ఆర్నెల్లు బాలింత వేషం నాది. సాయపడుతుంది వూరికే పెడ్తావా? పనిమనిషికి జీతం గాక మనిషన్నం కూరా వేస్తున్నావు. పాత చీరలిస్తున్నావు. నీ అత్తవారొచ్చి యింటిమీద బడి తింటుంటే నీకు నోరు పెగలదే?'' అని యీసడించింది. నక్షత్రం నాకూ మంచిదే. పోతే అయిన వాళ్లను కాని వాళ్లనూ మేపక్కర్లా. రోగాలు, రొష్టులూ భరించక్కర్లా'' అన్నాడు.

బావమరిది తన అక్కా బావ వారి కుటుంబ క్షేమం కోసం పలుగు పారా

తెచ్చి స్వయంగా గోడకు పెద్ద రంధ్రం చేసి, అందునుండి, చిన్న బావను దూర్చి తెచ్చి ధర్భల మీదుంచి తక్కిన తతంగం జరిపి, పాడె లేవంగానే తడి ధోవతీ, తడి కొల్లాయి ధరించి నిప్పుకుండ పట్టుకు ముందు నడిచాడు. చీదుతూ, కళ్లద్దుకుంటూ నాచురల్‌గా కనబడే అభినయం పట్టాడు.

కర్మలు జరగుతుండగా ఆరో రోజు చిన్నత్త రమాదేవి వచ్చింది. పరిస్థితి చూసి ఆశ్చర్యం అభినయించింది. ''వుత్తరం ముక్కపడేయలేదేం అల్లుడా?'' అని గుర్నాధాన్ని నిలదీసింది.

'' ఇదేం శుభవార్తా! శుభలేఖ పడేయాలా?'' అని ఆఫీసుకి వెళ్లిపోయాడు గుర్నాధం. కలెక్టరాఫీసులో జాబ్.

అందరూ ఒకళ్లనొకళ్లు వాటేసుకుని శోకాలు పెట్టాక, రమాదేవి పనిలో వంటలో సాయపడసాగింది.

ఏడోనాడు అత్తగారి దాయాది బావగారి కొడుకు అడ్వొకేట్ ఆదికేశవులు ఫామిలీతో వచ్చాడు. ''మాకు కబురే అందలేదు పిన్నీ. స్నేహితుడి కొడుకు పెళ్లికి వచ్చాం. వార్త అందితే వచ్చి తీసికెళ్లేవాడిని. కూతురింట్లో కర్మలు చేయరాదే! అద్దె యిల్లు అన్నారే? తమ్ముడికి తెలుసే? పెళ్లివారిచ్చిన విడిది యిరుకు. గోడలు వుప్పురిసినై. నీళ్లు లేవు. విడిగా గది లేదు. నేలమీద పట్టాలమీద శయనించాము. అల్లునికిపెద్ద యిల్లే దొరికింది'' అన్నాడు. పోగవుతున్న జనులను చూసి గుర్నాధం నీరసించాడు. తనతో తగాదాపడిన తనవారూ వచ్చారు. వారితో గుర్నాధం అత్తగారు ''కష్టదశ. ఆదరించే వారుంటే వస్తామా'' అని తడిబట్టగట్టి వంట చేస్తూ చీదుతూ, ముక్కు పీక్కుంటూ గూడెగరేస్తూ డబ్బు దాచిన పెట్టెను యెవరికంటాపడకుండా భద్రం చేసింది. రమాదేవి వంట సాయం చేస్తూ వియ్యాలవారితో అన్నది ''పిల్ల యీడేరింది. సంబంధాలు వెతుకుతూ చెట్టంత అల్లుడున్నాడని. సంబంధాలు చూపుతాడనీ వస్తే యిదీ పరిస్థితి. అక్కకు వయసు మళ్లింది. చేయలేదని వుండిపోయా'' అన్నది.

అలా పెద్దకర్మకు తోడల్లునివేపువారూ గుంపులుగా వచ్చి ఆపదలో

ఆదుకోవాలని వుండివెళ్లారు. పధ్నాలుగు రోజులకి యిల్లు నిశ్శబ్దమైతే గుర్నాధం పధ్నాలుగు పౌన్లు తూకం తగ్గి నీరసించి నిట్టూర్చాడు. ''యేం మర్యాదలు! యేం అపేక్షలు! యేం ఆచారాలు!'' అని గొణిగాడు.

అక్కడితో ఆ కర్మ ఆ అత్త పీడవిరగడైందనుకుని గుర్నాధం పొరపడ్డాడు. కాలు చేయి కూడదీసుకుని సంసారం దిద్దుకుంటూ పొదుపు వుద్యమం నడుపుతూ మనశ్శాంతిని కాపాడుకుంటుండగా అత్తగారీ మాటు కూతుర్నీ మనమడినీ వెంటబెట్టుకుని వచ్చేసింది నెత్తిమీదికి.

''చూడ చుట్టమూ, మొక్క దైవమూ లేదైపాయె. యేం చేయనూ? మనుమడికి పుట్టెడు జబ్బు. జబ్బేమిటో కనిబెట్టలేక పోయాడు ఘనవైద్యుడు. ఆస్తి రాబట్టాలనే దావాలు అలాగే వున్నాయి. ఇన్నింటికి డబ్బెక్కడనించి తేగలనూ? ఆడదాన్నైపాయె'' అలా అంటున్న అత్తను చూసి పులిని చూసిన మేకపిల్లలాగా అయిపోయాడు గుర్నాధం. డాక్టర్ని తెమ్మనీ, లేదా హాస్పటల్లో చేర్పించమనీ డిక్రీ యిచ్చిందత్త.

మెల్లిగా నోరు మెదిపాడు గుర్నాధం ''మీరే చేసుకోండవన్నీ డాక్టర్లు బిల్లు పంపిస్తారు. చెల్లించుకోండి. మా అమ్మ వచ్చింది. మంచంలో వున్నది. చూస్తున్నారుగా? నేడో రేపో అన్నట్టున్నది. మళ్లా నా వేపువారూ, తల్లివేపు వారూవస్తారు కర్మలకి. రక్త కూడు తినాలని వచ్చామంటారు. దానధర్మాలు ఆచారాలు జరపాలి నేను'' అని ఆఫీసుకు వెళ్తున్న అల్లుని చూసి, పళ్లు పటపటలాడించి, తల విసిరి, మెటికలు విరిచింది లీడింగ్ లేడీ.

నెల తిరక్క ముందే, వ్యాధి ముదిరి బిడ్డ తండ్రి వద్దకు పరుగెత్తాడు. పంచభూతాలు సముదాయిస్తూ తండ్రికిచ్చారు.

శోకాలు, మొత్తుకోళ్లూ స్త్రీలను పరిస్తే ఖర్చులు గుర్నాధాన్ని నరించాయి. మరి పెద్దల్లుడు గదూ మహిషికి!

3

గుర్నాధం శూన్యంలోకి చూస్తూ, గాలిలో లెక్కలు వేస్తూ చేతివేళ్లు

కదిలిస్తూ, ''మూడు చావులూ, ఖర్చులూ నా నెత్తిన రుద్దింది అత్త. కాలు కూడదీసుకోనివ్వదు. గద్దలా వచ్చి తన్నుకుపోతుంది. యెవర్నన్నా నెత్తి నెక్కిస్తుంది. తన మేనబావ అంతిమయాత్రా నేనే చూడాలా? చిన్నప్పుడీమెని బుజానేసుకుని సాకాడుట. చూచిపోదామని వచ్చాడట. గుండె జబ్బు మనిషి యింట్లోనే వుంటే సరిపోలా? వచ్చిన మర్నాడే గుండాగిపోతే ఖర్చులు గుర్తొచ్చి నా గుండె ఆగిపోలేదేం? ఏడవాల్సింది నేను! నాకేడుపు రాదేం? వచ్చిన వాళ్లెంతో యేడ్చారు తనివితీరా''.

''ఈ అత్త నేపోయాక పోతుందేమో. పెళ్లిలో ''నీ అత్త నీకన్న నాలుగేళ్లు చిన్న'' అని హాస్యాలాడారు, మహిళలు.

చిత్రం ముగిసింది.

4

గబగబా ప్రైజు నిర్ణయం జరిగింది. మరునాడు ప్రైజుల పందేరం జరుగునని పేపర్లో చదివి, ఫస్ట్ ప్రైజ్ యెవరికొచ్చిందోనని, మరో నాలుగు ఫిల్ముస్ గూడా అతి సహజంగా వున్నాయి. వాటికీ యిస్తారేమో ప్రైజులనే కుతూహలంతో సభికులు క్లబ్ హాలులో చేరి కుర్చీలు నింపి స్థిరంగా కూచున్నారు.

వేదిక మీద మైక్‌ముందు, అధ్యక్షురాలు గొప్ప వుద్యోగినీ మరియు మిలియనీర్ నిలబడి అనౌన్స్ చేసింది.

ఫస్ట్ ప్రైజ్ కొట్టినామె పేరువింతగా కొత్తగా వినబడినా వ్యక్తిని చూడాలనీ, వయస్సు యెంత వుంటుందోననీ చూస్తుండగా వేదిక వద్దకు వచ్చిన ఫస్ట్ ప్రైజ్ కొట్టినామెను చూసి, ఆమె ఫిల్మునంబరున్న అట్ట ఆమె పమిటకు గుచ్చబడి వుండటం చూసి గుడ్లప్పగించారు ప్రేక్షకులు.

తెల్లని ముసుగులో గుండూ, తెల్లధోవతీ, టపటపా ఆర్పే చిన్న కళ్లూ, కాళ్లకు చెప్పులన్నాలేవు. సెప్తునేరియన్ కావచ్చు. ప్రైజు డ్రాఫ్టు రూపంలో వస్తుంటే అందుకోటానికి, వంటినిండా కప్పుకున్న పమిటలోనించి చేయిజాపితే బోసి

చేయి. పమిటలోంచి రుద్రాక్షమాల తొంగి చూస్తూ నవ్వింది.

సెకెండ్ ప్రైజ్. జి. భువనమోహిని ఫిల్మ్‌నంబర్ పది. అంశము భర్తను మతిభ్రష్టుని చేసి యిల్లువదిలేట్టు చేసిన కధ.

థర్డ్ ప్రైజ్. ఫిల్మ్ నంబర్ ఇరవది. అంశము భర్త యెఫైర్సు అవినీతి తెలిసి దెబ్బతీసిన కధ. కె. మానికమ్మ. కన్సొలేషన్ ప్రైజ్. ఫిల్మ్ నంబరు ఇరువది యేడు. అంశము. భర్తకు ముక్కుతాడు పోసి డూడూ బసవన్నను చేసిన గడసరి గంగానమ్మ కధ.

''మళ్లా పోటీ నిర్వహించటానికి అయిదేళ్ల వ్యవధానమున్నది. ఆ వ్యవధానము. కధాచిత్రణము, ఫిల్మ్ తీయటానికీ సరిపోవాలని మా ఆశయం'' అంటున్నది ప్రైజులిచ్చినామె.

మనసులో కలిగే, చెలరేగే భావాలు కలత పెట్టగా ప్రేక్షకులు చైతన్యం కలిగినట్టు కుర్చీలు వదిలి హాలు వదిలారు.